విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 23, ఆగష్టు 2024

సంక్షోభంలో ఎస్సీ హాస్టల్..

- విద్యార్థులకు సదుపాయాలు కరువు
- వెంటాడుతున్న విష సర్పాల భయం
- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - చాగలమర్రి : హాస్టళ్లు తెరిచి రెండు నెలలు కావస్తోంది. అయితే ప్రభుత్వం హాస్టళ్లలో మౌలిక సదుపాయలు నేటి వరకు కల్పించ లేదు. దీంతో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. వర్షాలు కురు స్తుండడంతో పాత భవనాలు ఎప్పుడు కూలు తాయోనని విద్యార్థులు భయంతో బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. చాగలమర్రి మండలంలోని చిన్నవంగలి గ్రామంలో ఎస్సీ బాలుర సంక్షేమ హాస్టల్ భవనం పాత బడి ప్రమాదకరస్థాయికి చేరుకుంది. హాస్టల్లో 3

నుంచి 10వ తరగతి వరకు 120 మంది విద్యార్థులు ఉంటున్నారు. వసతి గృహం లోపలి భాగంలో పైకప్పు పెచ్చులూడి పోయా యి. విద్యార్థులకు స్నానపు గదులు, మరుగు దొడ్లు సక్రమంగా లేవు. స్నానపు గదులకు తలుపులు లేక పోవడంతో ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. విద్యార్థులకు మంచి నీటి సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా ఉంది. దీంతో కొళాయి నీరే తాగాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతు న్నారు. పొలాల పక్కన హాస్టల్ భవనం ఉండటంతో విషసర్పాల భయంతో బయటకు వెళ్లలేక పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి కొత్త భవనం ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లి

దండ్రులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం - ఖాశీం, ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ : ఎస్సీ బాలుర సంక్షేమ హాస్టల్లోని స్థితి గతులపై ఉన్నతా ధికారులకు ప్రతిపా దనలు పంపాం. హాస్ట ల్‌లోని మినరల్ వాటర్ ప్లాంట్ పని చేయడం లేదని అధికారులకు తెలియ జేశాం. హాస్టల్‌లోని సమస్యలపై అధి కారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. కొత్త భవనం ఏర్పాటు చేస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది.

బస్సు రాక కోసం విద్యార్థుల ఎదురుచూపు

విశాలాంధ్ర - నందికొట్కూరు: నియోజవర్గ పరిధిలోని ప్రాతకోట గ్రామానికి చెందిన విద్యార్థులు గత కొన్ని రోజుల నుంచి విద్యార్థి బస్సు కోసం ఏ సమయానికి వస్తుందోనని ఎదురు చూడడం జరుగుతుంది. ప్రాతకోట గ్రామానికి వారానికి మూడు రోజులు బస్సు రావడం, మరో మూడు రోజులు రాకపోవడం వల్ల విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రాతకోట గ్రామానికి ఉదయం 8:10 నిమిషాలకు వచ్చే సర్వీస్ బస్సు సరైన సమయానికి రాకపోవడంతో విద్యార్థులు మూడ్రోజులు బడికి, మూడ్రోజులు ఇంటి దగ్గర ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని విద్యార్థులు వాపోయారు. సరైన సమయానికి బస్సు రాకపోవడం వల్ల ఘణాపురం, ప్రాతకోట, లక్ష్మాపురం గ్రామాల్లో ఉన్న విద్యార్థులు మూడు గ్రామాల నుంచి దాదాపు 100 మందికిపైగా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బస్సు పాసులు ఉండి కూడా ఆటోలకు, బైకులపైన వెళ్ళవల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏపీఎస్ఆర్టీసీ అధికారులకు పలుమార్లు తెలియజేసిన అధికారులు పట్టించుకోవడం లేదనీ ఇకనైనా ఏపీఎస్ఆర్టీసీ నందికొట్కూరు డిపో మేనేజర్ నాగేశ్వరరావు 8:10 నిమిషాలకు వచ్చే సర్వీస్ బస్సు యధావిధిగా వారం రోజులు కొనసాగించాలని ప్రయాణికులు మరియు విద్యార్థినీ విద్యార్థినీలు కోరారు.

సంబంధంలేని డ్యూటీలు వేయడం సబబేనా

విశాలాంధ్ర - వెలుగోడు: సచివాలయ ఉద్యోగులమైన మాకు వివిధ రకాల పనులు కేటాయించడమే కాక ఇప్పుడు టాయిలెట్ ఫోటోలు తీయ మని ప్రభుత్వము కేటాయించడం తగదని సచివాలయ ఉద్యోగులు గురువారం తమ నిరసనను వ్యక్తం చేశారు. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఉమర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. స్కూలు కాంప్లెక్స్‌లోని టాయిలెట్ ఫోటోలను గతంలో ఉపాధ్యాయులు తీసి పంపించే వారు. ప్రభుత్వం కొత్తగా టాయిలెట్ ఫోటోలు తీయమని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు కేటాయించడం జరిగింది. దీంతో ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు ఇబ్బందులకు గురవుతున్నామని, తమకు సంబంధంలేని విధులను చేయడం తమకు ఇష్టం లేదని, ఈ విధుల నుండి తమను తొలగించాలని సచివాల ఉద్యోగులు కోరుతున్నారు.

ఎటువంటి సౌకర్యాలు లేకుండా హాస్పిటల్ ఓపెనింగ్

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: ఆత్మకూరు పట్టణంలోని యూపీహెచ్‌సీ హాస్పిటల్ నందు ఎలాంటి మౌలిక సౌకర్యాలు, సదూపాయలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం ఇక్కడ మంచినీటి సౌకర్యం లేదు. రహదారి సౌకర్యం లేక హాస్పిటల్ సిబ్బంది, రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండానే హాస్పిటల్‌ను ప్రారంభించారు. అంతేకాకుండా ఇక్కడ స్టాఫ్ నర్స్ లేదు, బెడ్స్ సదూపాయం కూడా లేవు. హాస్పిటల్ చుట్టూ ఎలాంటి ప్రహరి గోడ లేదు. దీనికి తోడు రాత్రిళ్ల పూట వాచ్‌మెన్, హాస్పిటల్‌కు సరిపడ సామాగ్రి, భద్రత సామాగ్రి లేవు. ఈ విషయాలన్నీ మున్సిపల్ కమిషనర్ హరి ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. హాస్పిటల్ పరిధిలో బోరు వేయిస్తామని, డ్రింకింగ్ వాటర్ సదుపాయం కల్పిస్తామని, హాస్పిటల్‌కు వెళ్లేందుకు సీసీ రోడ్డు మార్గాన్ని వేయిస్తామని ఆయన తెలిపారు. హాస్పిటల్ పరిధిలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు.

బెలుం సింగవరంలో పొలంబడి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని బెలుం రైతు సేవా కేంద్ర పరిధిలో బెలుం సింగవరం గ్రామం నందు మేలైన సాగు యాజమాన్య పద్ధతులు పొలంబడి కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి జ్యోతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. గ్రామ పరిధిలో వరి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ రైతులు వరినారును సూజమోనాస్ అనే జీవ శైలింద్రంతో నారును శుద్ధిచేసి, నాటు వేయాలన్నారు. వరికి సోకే అగ్గి తెగులు, ఎండు తెగులు తదితర తెగుళ్లను నివారించవచ్చని తెలిపారు. అనంతరం అవసరమైన రైతులకు సుజా మోనాస్ జీవ రసాయన ఎరువులు అందించారు. వీఏఏ చిన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

బనగానపల్లెలో అక్రమ లేఔట్‌లు తొలగింపు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఏపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు బనగానపల్లెలో అక్రమ లేఔట్‌లను తొలగించినట్లు కుడా వైఎస్ చైర్మెన్ ప్రతాప్, సూర్యనారాయణరెడ్డి ప్లానింగ్ ఆఫీసర్ సంధ్యా విజయభాస్కర్‌లు తెలిపారు. బనగానపల్లె నియోజకవర్గంలో అనధికారికంగా నిర్మించిన లేఔట్‌లను గుర్తించి వాటిని గురువారం తొలగించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ నుండి అనుమతి పొందాల్సి ఉందన్నారు. అనుమతులు పొందకుండా రిజిస్ట్రేషన్ చేయడం, అక్కడ వసతులు కల్పించడం, భవననిర్మాణాలు చేపట్టడం, రోడ్లు, కరెంటు, డ్రైనేజీ లాంటి వసతులు కల్పించడం చట్టరీత్యా నేరమన్నారు. సదరు అనుమతులు లేకుండా లేఔట్‌లు వేసిన వాటిని గుర్తించి వాటి కుడా వైస్ చైర్మెన్‌తోపాటు ప్లానింగ్ అధికారులు, బనగానపల్లె సర్కిల్ ఇన్స్‌క్టర్‌ల ఆధ్వర్యంలో గురువారం తొలగించడం జరిగిందని వారు తెలిపారు.

CHANGE OF NAME

I, Nayab Nazirunnisa, residing at H.No: 28/794 M4-2G-2, NGOS Colony, Nandyal, Nandyal District, Andhra Pradesh, do hereby declare that my daughter's previous name was Sayyida Safoorah.That I have changed my daughter's name from Sayyida Safoorah (Old Name) to **Sayyida Safura** (New Name). Henceforth, my daughter shall be known as **Sayyida Safura.**

ప్రజలకు మెరుగైన రీతిలో రెవెన్యూ సర్వీసులు అందించండి

విశాలాంధ్ర - నంద్యాల: రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సర్వీసులు అందిస్తే గ్రీవెన్స్ తగ్గుతాయని, ఈ మేరకు రెవెన్యూ అధికారులు అవినీతికి ఆస్కారం లేకుండా చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రెవెన్యూ అంశాలపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఆర్ఓ ఎ.పద్మజ, ఆర్డీఓలు మల్లికార్జున్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఎం.దాసు అన్ని మండలాల తహసీల్దారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు, మ్యూటేషన్, భూ ఆక్రమణలకు సంబంధించి అనేక ఫిర్యాదులొస్తున్నాయని, స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వకుండా, వెబ్ లాండ్‌లో నమోదు చేయకుండా, ల్యాండ్ లిటికేషన్‌లో ఉంచి అక్రమాలకు పాల్పడినట్లు వెల్లడైతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో 32 వేల ఎకరాల అసైన్డ్ భూములు, మరో 32 వేల ఎకరాలు ఇనాం భూములను విధివిధానాలు అవలంబించకుండా డిపట్టా ఇచ్చారని, వీఆర్వో, పంచాయతీ సెక్రటరీ పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చినట్లయితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కేంద్రంగా ఏర్పడి రెండున్నర ఏళు అయినప్పటికీ కర్నూలు నుండి ఇంకా భూ రికార్డులు తెప్పించుకోలేదని శనివారంలోగా రికార్డులన్నీ తెప్పించుకోవాలని కలెక్టరేట్ ఏవోను ఆదేశించారు. అన్ని తహసీల్దారుల కార్యాలయాల రికార్డ్ రూములను తాను పర్యవేక్షిస్తానని క్రమ పద్ధతిలో రికార్డులు ఉంచాలని రికార్డుల నిర్వహణను బట్టి పనితీరును అంచనా వేస్తామన్నారు. వచ్చేనెల రెండవ వారం నుండి రెవెన్యూ సదస్సులు జరగనున్నాయని, ఇందుకు సంబంధించి ఇనాం, ఆర్ఎస్ఆర్, అడంగల్ తదితర రెవెన్యూ రికార్డులను అందుబాటులో ఉంచుకొని సీనియర్ అధికారులు ఎవరొచ్చినా తడబడకుండా సమాధానాలు చెప్పాలని ఆమె రెవెన్యూ అధికారులును ఆదేశించారు. ఏ గ్రామంలో ఎలాంటి సమస్యలు వస్తాయో విశ్లేషించుకుని ఆయా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సిద్ధంగా వుండాలన్నారు. జిల్లాలో 112 లోకాయుక్త కేసులున్నాయని, అందులో 36 రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉన్నాయని ఇందుకు సంబంధించిన రికార్డులన్నీ తాను పరిశీలిస్తానని అందుకు తగ్గ నివేదికలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హైకోర్టులో కేసు ఫైల్ అయిన వెంటనే కౌంటర్ ఎందుకు వేయడం లేదని, కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ అమలు చేయకుండ కంటెంప్ట్ కు ఎందుకు వెళ్తున్నారని ఆమె ప్రశ్నించారు. జాతీయ రహదారులు, రైల్వేస్, ఆర్అండ్ బి దారులకు అవసరమైన భూసేకరణను నిర్ణీత కాల వ్యవధిలో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో మోడల్ స్కూల్

విశాలాంధ్ర-బనగానపల్లె : జాతీయ స్థాయి కరాటే పోటీలలో బనగానపల్లె మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థి కొడితం సాయి చరణ్ తేజ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపల్ రామలక్ష్మి తెలిపారు. ఈ నెల 15 నుండి 18వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలోని చండీ ఘర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ తరపున 30 మంది పాల్గొనగా అందులో వారి వారి విభాగాల్లో 6 మంది క్రీడాకారులు విజయం సాధించారు. బనగానపల్లె ఏపీ మోడల్ స్కూల్ తరపున పదవ తరగతి చదువుతున్న కొడితం సాయి చరణ్ తేజ క్యాడేట్ 14, 15 మైనస్ 52 కేజీ కుమితే విభాగంలో బంగారు పతకం సాధించాడని తెలిపారు. జాతీయస్థాయి కరాటే పోటీల్లో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ రామలక్ష్మి, పిడి సిరాజున్, అమిరున్ మేడం ఉపాధ్యాయుల బృందం విద్యార్థిని విద్యార్థులు అభినందించారు. జెన్ స్పోర్ట్స్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ కళ్యాణ్ బాబు, కరాటే బాష రఫీ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

విశాలాంధ్ర- కొలిమిగుండ్ల: మండలంలోని తుమ్మలపెంట గ్రామం అల్ట్రాటెక్ గేట్ సమీపంలో అక్రమంగా కర్ణాటక మద్యన్ని విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సిఐ రమేష్ బాబు గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన యాతం పెద్దిరెడ్డి అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ ఎనిమిదవ గేటు వద్ద మద్యాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. అతని వద్ద నుండి 113 క్వార్టర్ బాటిల్‌లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. పెద్దిరెడ్డిని కోవెలకుంట్ల కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. మండల పరిధిలో అక్రమ మద్యం, సారాయి, మట్కా, పేకాట లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సైబర్ క్రైమ్, హ్యూమన్ ట్రాఫికింగ్‌పై అవగాహన

విశాలాంధ్ర - నంద్యాల: పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో సైబర్ క్రైమ్, హ్యూమన్ ట్రాఫికింగ్, ఉమెన్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నంద్యాల పోలీస్ సైబర్ సెక్యూరిటీ విభాగం నుండి సబ్ ఇన్స్పెక్టర్ కుమారి ఆధ్వర్యంలో రామకృష్ణ డిగ్రీ కళాశాల నందు ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థినీ విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల హ్యూమన్ ట్రాఫికింగ్, ట్రాఫిక్ నిబంధనల గురించి, మహిళలపై, చిన్న పిల్లలపై జరిగే నేరాల గురించి అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 800 మంది రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఇన్చార్జ్ రవణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - నంద్యాల : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా, తాహేర హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పద్మ విభీషణ్ డాక్టర్ చిరంజీవి జన్మదినం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జిల్లా కార్యవర్గ సభ్యుడు యాకుబ్ కుమారుడు సాహిల్ జన్మదినం సందర్భంగా స్థానిక ఎన్జీవో కాలనీలోని నారాయణ హైస్కూల్ నందు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరం నందు దాదాపు 30 మందికి పైగా రక్తదానం చేయడం జరిగిందని స్కూల్ డైరెక్టర్ డాక్టర్ యాకూబ్, కరస్పాండెంట్ ఇషాకవలి లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, వైస్ చైర్మన్ ఆర్. మారుతి కుమార్, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు రమేష్ రావు, బాలుడు, శ్రీనివాస్, నవభారత్ స్కూల్ హుస్సేన్, నలంద స్కూల్ ఉత్తెజ్, శ్రీ సాయివాణి స్కూల్ హుస్సేన్ భాష, నారాయణ స్కూల్ కరెస్పాండెంట్ ఇషాక్ వలి, శిరీష, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 30 మంది రక్తదానం చేయడం జరిగింది.

ఉపాధి పనుల గుర్తింపుపై నేడు గ్రామసభలు

విశాలాంధ్ర - రుద్రవరం: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల నందు ఉపాధి పనుల గుర్తింపుపై నేడు గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి, వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని గ్రామపంచాయతీ నందు వ్యవసాయ అనుబంధ పనులు, నీటి సంస్కరణ పనులు, మౌలిక సదుపాయాల కల్పన పనులు, వ్యక్తిగత లబ్ధినిచ్చే పనులు గ్రామసభ ద్వారా గుర్తించి సదరు పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ గ్రామ సభలను మండల ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ఉపాధి వెలుగు సిబ్బంది నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని చిన్నవంగలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం హెచ్ఎం జీవయ్య ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ నేడు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చంద్రయాన్-3 ల్యాండర్‌ను, రోవర్‌ను చంద్రునిపై విజయవంతంగా ల్యాండ్ చేయడం ద్వారా మైలురాయిను చేరుకుందన్నారు. ఈ విజయానికి చిహ్నంగా నేడు భారత జాతీయ అంతరిక్ష దినోత్స వంగా నిర్వహిస్తున్నామన్నారు. వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వ హించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో దీక్షా యాప్ జిల్లా కోఆర్డినేటర్,సైన్స్ ఉపాధ్యాయులు నాగేంద్రకుమార్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నేడు గ్రామసభలు

విశాలాంధ్ర - నంద్యాల రూరల్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నంద్యాల మండలంలో నేడు ఎన్ఆర్ఈజీఎస్ పనులకు సంబంధించి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఎంపీడీవో గురువారం సుగుణశ్రీ పత్రికా ప్రకటనలో విలేకరులకు తెలిపారు. గ్రామసభలలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుగా ఎస్సీ, ఎస్టీ కులాలకు సంబంధించి వారి పొలాలలో పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. మిగిలిన పని దినాలలో ప్రాంతాలవారీగా పనులు చేపట్టడం జరుగు తుందని ఆమె తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి గ్రామపంచాయతీల సర్పంచులు గ్రామ పెద్దల ఆమోదంతో పనులు ఎక్కడెక్కడ చేపట్టాలని వారి నిర్ణయం మేరకు పనులు చేయడం జరుగుతుందన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా వెంకటరామిరెడ్డి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్ రమేశ్ బాబు బదిలీ అయ్యారు. ఆయనను కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెంట్‌గా బదిలీ చేయగా ఆయన స్థానంలో ముమ్మడివరం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న గురువిరెడ్డి వెంకటరామిరెడ్డిని నియమిస్తూ గురువారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జి.వెంకట్రామిరెడ్డి గతంలో ఆళ్లగడ్డలో మున్సిపల్ కమిషనర్‌గా పని చేశారు. ఈ మేరకు ఆయన ఈ నెల 24న బాధ్యతలు స్వీకరించనున్నారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 24న మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడివో మహబూబ్ ఖాన్ గురువారం తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, జడ్పిటిసి, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మృతికి నివాళ్లర్పించిన మాజీ సర్పంచ్ రాజారెడ్డి

విశాలాంధ్ర-బనగానపల్లె: పట్టణంలోని రంగరాజు పేట కాలనీకి చెందిన రఘునాథరావు (64) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసు కున్న బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి గురువారం రంగరాజు పేటకి చేరుకొన్నారు. భౌతికయానికి పూల మాలతో నివాళకలర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పుట్ బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రాష్ట్ర పుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాలలో ఈ నెల 18న జరిగిన అండర్-13 జిల్లా స్థాయి బాలుర పుట్ బాల్ పోటీలలో ఆళ్లగడ్డ విశ్వశాంతి పాఠశాలలో చదివే నాగ ఉత్తేజ్ అత్యంత ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కరస్పాం డెంట్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ రెడ్డి క్రీడా కారున్ని అభినందించారు. నేటి నుండి 25వ తేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని విజయం సాధించాలని ఆకాం క్షించారు. తమ పాఠశాలలో, విద్యతోపాటు, క్రీడలను మరియు కల్చర్ యాక్టివిటీస్‌ని విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. పుట్ బాల్‌లో శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు విక్రమ్‌ను అభినందించారు.

ముగ్గురు ఉద్యోగస్తులు సస్పెన్షన్

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల మున్సిపల్ అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. నంద్యాల పురపాలక సంఘం రెవెన్యూ ఆఫీసర్ కృష్ణ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గులాం హుస్సేన్, 35వ వార్డు అడ్మిన్ సెక్రటరీ సుధాకర్లను సస్పెండ్ చేస్తూ కమిషనర్ నిరంజన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పురపాలక సంఘం పరిధిలో న్యాయస్థానంలో కేసు నడుస్తున్న స్థలానికి సంబంధించి వీఎల్‌టీ పన్ను విధించడాన్ని తప్పు పడుతూ ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. వివాదాస్పద స్థలానికి ఖాళీ స్థలం పన్ను విధించడంపై వేటు పడినట్లు తెలిసింది. కోర్టులో వివాదం నడుస్తుండగా పన్ను వేయడంలో బాధ్యులైన ముగ్గురు ఉద్యోగస్తులను సస్పెండ్ చేస్తూ కమిషనర్ నిరంజన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఆర్వో, ఆర్ఐ, 35వ వార్డు అడ్మిన్ సెక్రెటరీలపై సస్పెన్షన్ ఉత్తర్వులు ఇస్తూ రీజనల్ డైరెక్టర్‌కు పంపడం జరిగిందని విలేకరులకు వివరించారు.

నేడు గ్రామసభలు

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టేందుకు ప్రతి గ్రామంలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామ సభలో సర్పంచులు, వార్డు మెంబర్లు, రైతులు, గ్రామ ప్రజలతో కలిసి కార్యదర్శులు ఆయా గ్రామ సచివాలయాల్లో గ్రామ సభలు నిర్వహించాలన్నారు. ముందస్తుగా ప్రజలందరికీ తెలిసేలా టాంటాం వేయించి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు.

ఈ నెల 26న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

విశాలాంధ్ర - రుద్రవరం : ఈనెల 26న సోమవారం ఇస్కాన్ అహోబిలం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా హరి నగరం గ్రామం దగ్గర నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ అహోబిలం ప్రాజెక్ట్ ఇంచార్జ్ చంద్రకేశవ దాస్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా ఈనెల 26వ తేదీ సాయంత్రం 4 గంటల అన్ని గ్రామాల నుంచి వచ్చిన యువకులకు గ్రూపుల వారీగా ఉట్లో ఉత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. 6 గంటలకు హారతి భజన కార్యక్రమం ఉంటుందన్నారు. 6:30 నిమిషాలకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చేతుల మీదుగా బహుమతుల ప్రధనోత్సవము, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి చేశ్రీకృష్ణ జన్మాష్టమి సందేశము ఉంటుందన్నారు. 8 గంటలకు కూచిపూడి కళానిధి డాక్టర్ వేదాంత రామలింగ శాస్త్రిచే నర్తనశాల నృత్య నాటక ప్రదర్శన కార్యక్రమం ఉంటుందన్నారు. 11 గంటలకు శ్రీకృష్ణ అవతారణంలో ప్రత్యేక బాణాసంచా ప్రదర్శన కార్య క్రమాన్ని నిర్వహిస్తున్న మన్నారు. రాధా గోవిందులకు మహా శంఖా భిషేక కార్యక్రమం ఉంటుంద న్నారు. 11:30 నుంచి 12 గంటలకు భోజన ప్రసాద కార్యక్రమం ఉంటుందన్నారు. 27న ఇస్కాన్ వ్యవస్థాపక ఆచార్య కృష్ణమూర్తి భక్తి వేదాంత స్వామి శ్రీల ప్రభు పాద జన్మదిన వేడుకలు, అభిషేకం వ్యాస పూజ, ప్రవచన ములు కార్యక్రమాలను నిర్వహిస్తు న్నామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

ఏపీ మోడల్ స్కూల్ తనిఖీ చేసిన త్రీసభ్య కమిటీ

- విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి
- బాల్య వివాహాలను అరికట్టాలి
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కమిటీ

విశాలాంధ్ర - మిడుతూరు : ప్రభుత్వ ఆదేశాల మేరకు నియమించబడిన త్రిసభ్య కమిటీ గురువారం మండల కేంద్రమైన మిడుతూరులోని స్థానిక ఏపీ మోడల్ స్కూల్ కేజీబీవీ, ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మిగంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల తో కలిసి భోజనం చేసి, ఉపాధ్యాయులతో కలిసి పాఠ్యాంశాలు ఎలా బోధిస్తున్నారని విద్యార్థిని, విద్యార్థు లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని అంతేకాక బాలికలకు బాల్య వివాహాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పాఠశాల ఉపాధ్యాయులకు తెలిపారు. పాఠశాలకి కావాల్సిన మౌలిక వసతుల వివరాలు త్రిసభ్య కమిటీ అధికారులు నమోదు చేసుకున్నారు. ఏపీ మోడల్ స్కూల్ లో విద్యార్థులు ట్యాబ్ లలో రాస్తున్న సీబీఎస్‌సీ పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి పరిసరాలు అన్ని శుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే పిల్లలు ఆరోగ్యంగా ఉండి బాగా చదువు కుంటారని, ప్రభుత్వం నుంచి విద్యార్థులకి అందించే సౌకర్యాలు అన్ని సక్రమంగా అందించాలని వార్డెన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారి శ్రీనాథ్, గ్రామ పంచాయితీ కార్యదర్శి సుధీర్, సంక్షేమ విద్య సహాయకులు, మహిళా పోలీసు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

మృతుని కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : అచ్యుతాపురం బ్లాస్టింగ్ సంఘటన మరువక ముందే సనగర సమీపంలోని ఓర్వకల్లు మండలంలో ఉన్న జయరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్‌లో బ్లాస్టింగ్ కారణంగా బీహారీ మృతి చెందినట్లు పుకార్లు వస్తున్నాయి. తన ప్లాంట్‌లో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని యాజమాన్యం చెపుతుంది. ప్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో సంస్థలకు ఆస్తినష్టం జరిగిందని, ఎవరూ ప్రాణాలు కోల్పోలేదని యాజమాన్యం తెలియచేస్తుంది. ఓర్లకల్లు మండలం గుట్టలపాడు వద్ద జయరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్‌లో బుధవారం మద్యాహ్నం 1గం సమయంలో జరిగిన ప్రమాదంలో బీహార్‌కు మృతి చెందగా ఇరువురుకి గాయ్యాయి. ప్రచారం జోరుగా సాగుతుంది.

ప్రాణనష్టం జరలేదని యాజమాన్యం తప్పుడు ప్రచారం - సీపీఐ, ఏఐటీయూసీ : ప్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందాగా ఇరువురు గాయ పద్దారని సీపీఐ ఏఐటీయూసీ నాయకులు అంటు న్నారు. మార్చూరి వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.ము నెప్ప, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, ఏఐటీ యూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఓర్వ కల్లు మండల కార్యదర్శి రమేష్, సహాయ కార్య దర్శి సుధాకర్, రైతు సంఘం నాయకులు మహబూబ్ బాష, ఏఐ వైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు,బీసన్న, సురేంద్ర లు మార్చురీ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భం గా మునెప్ప, రామకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ కార్మికుడు చనిపోకపోతే వైద్యశాలలో ఉన్న బీహారీ మృతదేహం ఎవరిదని ప్రశ్నించారు. యాజమాన్యం ఎందుకు దాస్తుందన్నారు. మృతి చెందిన బీహారీ కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లిం చాలని, గాయపడిన వారికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్యాక్టరీల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని మంగళ వారం అచ్యుతాపురంలో బ్లాస్టింగ్ కారణంగా సుమారు 20 మందికి పైగా మృతి చెందినట్లు పుకార్లు వస్తున్నా మృతుల సంఖ్య మరింత పెరుతుందనే పుకార్లు ఉన్నాయ న్నారు. ఆ సంఘటన మరువక ముందే ఓర్వకల్లు మండలంలో జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాగా, ఇరువురుకి గాయాలు అయ్యా యన్నారు. ప్యాక్టరీలో ఎటువంటి ప్రమాదం జరిగ లేదని, ఎవరూ మృతి చెందలేదని యాజమాన్యం చెపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటనపై జిల్లా కలెక్టర్ త్రిసభ్య కమిటీ వేసి విచారణ చేయిం చాలని కోరారు. బాధితలను ఆదుకోవాలని కోరారు.

ఇలా అయితే ఎలా పోవాలి...?

- పొలం పనులకు వెళ్లాలంటే ఈ నీటిలో ఈత వేయాల్సిందే..
- వెళ్లలేక ఇబ్బందు పడుతున్న గుమ్మనూరు గ్రామస్తులు
- ఏ మాత్రం పట్టించుకోని రైల్వే బ్రిడ్జి కాంట్రాక్టర్లు

విశాలాంధ్ర- చిప్పగిరి: భారతదేశానికి పల్లెటూళ్ళే పట్టు కొమ్ములని, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే దేశ అభివృద్ధి చెందుతుందని చెప్పడానికే తప్ప గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి మాత్రం అంతంత మాత్రమేనని గ్రామీణ ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి మండల పరిధిలోని గుమ్మనూరు గ్రామస్తులు పొలాలకు వెళ్లాలంటే నీటిలో ఈదుకుంటూ పొలం పనులు చేసుకోవలసిన దుస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన చేస్తున్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోనే గుమ్మనూరు గ్రామం వద్ద శంకర్, గుమ్మనూరు రైల్వే స్టేషన్‌కు సంబంధించి గేటును తొలగించి అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని రూ.8 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టడం జరిగింది. అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఎడితెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వర్షం నీరంతా బ్రిడ్జిలోనే ఉండిపోవడంతో గుమ్మనూరు గ్రామస్తులు రైల్వే లైన్ అవతల ఉన్న పొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతూ మనిషి లోతులో ఉన్న నీటిలోనే ఈదుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని గుమ్మనూరు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేసి బ్రిడ్జిలో వర్షపునీరు నిలువ ఉండకుండా చూడాల్సిన బాధ్యత రైల్వే అధికారులపై గ్రామస్తులు ఉందన్నారు.

మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందాం

విశాలాంధ్ర- కల్లూరు: మొక్కలను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని మండల అధ్యక్షురాలు బోయ శారద పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల పరిధిలోని సల్కాపురం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రాథమిక పాఠశాలలో ఏపీఎం మద్దేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కలు నాటే కార్యక్రమానికి మండల అధ్యక్షురాలు శారద, ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ మద్దిలేటి, ఈఓఆర్‌డి కిషోర్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ చెట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నేటి సమాజంలో అనేకమంది మొక్కలను నరికి వేస్తున్నారని వాటి వల్ల కాలుష్యం కలుషితమైపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ మధు బాబు, టిఏలు ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామ నాయకులు పాఠశాల ఉపాధ్యా యులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి జీ తెలుగు సీరియల్స్ ప్రారంభం

విశాలాంధ్ర - కర్నూలు : తెలుగు ప్రేక్షకులకు అంతులేని వినోదం అందించడంలో ముందుండే జీ తెలుగు మరో సర్‌ప్రైజ్‌తో వస్తోంది. ప్రేక్షకుల ఆదరాభిమానాలతో విజయవంతంగా కొనసాగుతున్న సీరియల్స్‌ని ఇక నుంచి ఆదివారం సైతం సిద్ధమైంది. సోమవారం నుంచి శనివారం వరకు సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు ప్రసారమయ్యే సీరియల్స్ అన్నీ ఆగస్ట్ 25 నుంచి ఆదివారం కూడా ప్రసారం అవుతాయి. చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి, మా అన్నయ్య, నిండు నూరేళ్ళ సావాసం, మేఘసందేశం, పడమటి సంధ్యారాగం, త్రినయని సీరియల్స్ ఇకనుంచి ఆదివారం కూడా తమ అభిమానులను అలరిస్తాయి.

25న సీపీఐ ప్రజా సంఘాల బాధ్యుల సమావేశం

విశాలాంధ్ర - తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్ ఆర్.ఎస్ గ్రామం నందు ఈ నెల 25, ఆదివారం ఉదయం 10 గంటలకు సీపీఐ తుగ్గలి, మద్దికేర మండల సమితి సభ్యుల ప్రజా సంఘాల బాధ్యుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఐ తుగ్గలి మండల కార్యదర్శి సుల్తాన్ తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గిడ్డయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు నభీరసూల్ హాజరవుతారని ఆయన తెలియజేశారు. ఈ సమావేశం సమితి సభ్యులకు చాలా ప్రాముఖ్యత కూడుకున్నదని, ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరై, సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి సుల్తాన్ తెలిపారు.

సెబీ చీఫ్ వెంటనే రాజీనామా చేయాలి

విశాలాంధ్ర - జిల్లా పరిషత్ : సెబీ చీఫ్ మాధురి పురి బచ్ వెంటనే రాజీనామా చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్య క్షులు కె.బాబురావు డిమాండ్ చేశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపుమేరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ముందు జరిగిన నిరసన జరిగింది. ఈ సందర్భంగా డీసిసి అధ్యక్షులు బాబురావు మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ముందు సెబీ చీఫ్ మాధబి పురి బచ్‌కు ఆదాని గ్రూప్ సంస్థల వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ సంఘం జెపిసి వేయాలన్నారు. దేశంలో జరుగుతున్న అతి పెద్ద స్టాక్ మార్కెట్ కుంభకోణంపై వినూత్నంగా చర్చ జరగాలని, ఆదాని సెబీ సంబంధాలపై హిండేన్ బర్గ్ నివేదికలో వెల్లడించిన అంశాలపై విచారణ జరపాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన అంశాలను అమలు చేయకుండా తాత్సారం చేస్తుందన్నారు. ప్రభుత్వ శాఖల ప్రక్షాళనతో పాటు అభివృద్ధి సంక్షేమాలపై దృష్టి పెట్టాలని బాబురావు గారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ, షేక్ జిలాని బాష, ఆదోని జి.రమేష్ యాదవ్, పీసీసీ అధికార ప్రతినిధి బి.రామాంజనేయులు, కోఆర్డినేషన్ చైర్మన్ అనంతరత్నం పాల్గొన్నారు.

జడ్పీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం

విశాలాంధ్ర- హొళగుంద : మండల కేంద్రంలోని ఎస్ఎస్‌వి కిరాణా అంగడి నుండి స్థానిక నేతాజీ పాఠశాల వరకు రూ.5 లక్షల జడ్పీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడతామని వైకాపా నాయకుడు కోకిల తోట శేషప్ప అన్నారు. సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు కురువ బుజ్జమ్మ సహకారంతో ఐదు లక్షల రూపాయలు జడ్పీ నిధులు మంజూరయ్యాయని ప్రజల అవసరాల కోసం రోడ్డు నిర్మించడం జరుగుతుంద న్నారు ఎన్నో ఏళ్ల నుండి సిసి రోడ్డు లేక గుంతల మయంలో ప్రజలు రాకపోకలు ఇబ్బందులు పడ్డారన్నారు. సీసీ రోడ్డు నిర్మిస్తే ఎలాంటి కష్టం ఎదురు కాదని, రోడ్డు నిర్మాణానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు సైకిల్ షాప్ రజాక్, తంబాకు సైపుల్ల, సామాజిక కార్యకర్త శాలి షబ్బీర్, సాదావలి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్‌సాని.. ఎక్కడ మృతి చెందాడో నిజా, నిజాలు బయటికి తేవాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ప్రభుత్వ సరోజన వైద్యశాల మార్చురీలో ఉన్న బీహార్‌కు చెందిన ప్రేమ్‌సాని కరెంట్ షాక్ కొట్టి మృతి చెందిన ప్రేమ సాని మృతదేహానికి ప్రమాదం ఎక్కడ జరిగిందో నిజా నిజాలు బయటికి తేవాలని సీపీఐ, ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, ఓర్వకల్లు సీపీఐ మండల కార్యదర్శి రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శీనివాసులు, బిసన్నల ఆధ్వర్యంలో గురువారం మార్చురి ముందు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓర్వకల్లు మండలం జయరాజ్ స్టీల్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికుడు ఫ్యాక్టరీ ప్రమాదంలో మృతి చెందగా, ఇరువురు గాయపడినట్లు స్థానికుల ద్వారా తెలుస్తుందన్నారు. కంపెనీ యాజమాన్యం మాత్రం ఫ్యాక్టరీలో ఎలాంటి ప్రమాదం జరగలేదని, ఇదంతా ఒట్టి పుకార్లు అంటూ అని ఫేక్ న్యూస్ అని చెబుతున్నారని తెలిపారు. ఓర్వకల్లు పోలీసు వారు మాత్రం ప్రమాదం జరిగిందని, ఫ్యాక్టరీలో మాత్రం కాదని చెప్తున్నారు. ఇంకో ఊర్లో ప్రమాదం జరిగిందని ఇంకొకరు చెబుతున్నారు. దీన్ని బట్టి చూస్తే చనిపోయిన బీహార్ ప్రేమ సాని మృతిపట్ల అనేక అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. బీహార్ కార్మికుడు ప్రేమ సాని మృతిపట్ల జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ నిజనిర్ధారణ కమిటీ వేసి నిజాలు బయటపెట్టాలన్నారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, నిజంగా ఓర్వకల్ జయరాజ్ స్టీల్ ఫ్యాక్టరీలో ప్రమాదం జరిగి ఉంటే భద్రత ప్రమా ణాలు పాటించని కారణంగా జరిగిన ఈ ప్రమాదానికి యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు.

వరద నీటితో పొంగి ప్రవహించిన వేదావతి

విశాలాంధ్ర - హొళగుంద : మండలంలోని మార్ల మడకి సమీపంలో ప్రవహించే వేదవతి నది గురువారం వరద నీటితో పొంగి ప్రవహించడం వల్ల ఇరు రాష్ట్రాల రాకపోకలు పూర్తిగా స్తంభించి పోయాయి. వరద నీరు కాజువేపై ఉధృతంగా ప్రవహించడం వల్ల వాహనాలు రాకపోకలు జరగక ప్రజలు నానా అవస్థలు పడ్డారు నదిలో ఎవరు వెళ్లకుండా సెబ్ అధికారులు రస్తాకు గేటు అడ్డంగా వేసి జాగ్రత్త వహించారు. నదిలో ఎవరు దిగవద్దని ప్రజలను హెచ్చరించారు. నదిపై నిర్మించిన కాజ్ వే చిన్నదిగా ఉన్నదని, చిన్నపాటి వర్షానికే వరద నీరు పొంగి ప్రవహిస్తే రాకపోకలు పూర్తిగా స్పందించి పోతున్నాయి ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి కాజు వేలు ఎత్తుగా నిర్మించాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేశారు. బళ్ళారి వెళ్లాల్సిన వాహనం నది ఒడ్డునే నిలిచిపోయింది. ఉత్తనూరు, మోటా సుగూరు తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు నది వద్దే పడిగాపులు కాశారు. నది ఉధృతంగా ప్రవహించడం వల్ల ఆరువేల రూపాయల ఎయిర్టెల్ ఆస్తి నష్టం జరిగిందని సిబ్బంది శ్రీకాంత్ తెలిపారు నది నీటికి ప్రజలు గంగమ్మ పూజలు చేసి నమస్కరించారు. కాజు వే అడుగు భాగంలో పూడిక నిండిపోవడంతో నీరు పైకి ప్రవహిస్తున్నాయని దీనివల్ల తీవ్ర ఇబ్బంది కలుగుతుందని నది తీరా ప్రాంతాల ప్రజలు పేర్కొన్నారు. వరద నీటి వల్ల నది తీర ప్రాంతాల పంట పొలాలు నీట మునిగాయి. ఎన్నో ఏళ్ల నుండి వర్షాకాలంలో కాజ్వే పై వరద నీరు ప్రవహిస్తే రాకపోకలు స్తంభించిపోయినప్పటికీ ఎవరు స్పందించడం లేదని ప్రజలు ఆరోపించారు. ఇరు రాష్ట్రాలను అనుసంధానం చేసే వేదావతి నది కాజ్‌వే త్తుగా నిర్మించాలని ప్రజలు కోరారు.

117 జీవో రద్దు చేయాలి : ఎస్టీయూ

విశాలాంధ్ర - పెద్దకడబూరు : ప్రభుత్వ విద్యా వ్యవస్థను అస్త వ్యస్తం చేస్తున్న 117 జీవోను వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం మండలంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్య క్రమంలో భాగంగా హనుమాపురం, పెద్దకడబూర్ ఉన్నత పాఠశాల, కల్లుకుంట, కంబదహాల్, గవిగట్టు, బసలదొడ్డి ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయుల సమస్యలు సేకరించి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగంలో సంస్కరణల పేరుతో అమలు చేసిన పాఠశాల విలీనం వల్ల ప్రాథమిక పాఠశాలలు బలహీన పడిపోయి కనుమరుగయ్యే అవకాశం ఉందని, కొత్త ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే స్పందించి 117 జీవో రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టియు రాష్ట్ర పూర్వ కార్యదర్శి ప్రసన్నరాజు, ఎస్టీయూ పెద్దకడబూర్ మండల అధ్యక్షుడు తులసిరాం, ప్రధానకార్యదర్శి లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ మెంబెర్స్ రాజశేఖర్, దామోదర్, షాబీర్, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు నిర్వహించండి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు నేడు జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. గురువారం ఉదయం తన కార్యాలయంలో జాతీయ అంతరిక్ష దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయాన్ని గుర్తుచేసుకోవడానికి భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించిందని ఆయన తెలిపారు. అన్ని పాఠశాలలు, శిక్షణా సంస్థలలో విద్యార్థులకు వర్క్‌షాప్ లు,ప్రదర్శనలు, ఉపన్యాసాలు నిర్వహించాలని అన్నారు. చంద్రుడిని స్పృశించినపుడు - జీవితాలను స్పృశించవచ్చును అనునది 2024వ సంవత్సరపు జాతీయ అంతరిక్ష దినోత్సవం ఇతివృతంగా నిర్ణయించబడిందని అన్నారు. చంద్రయాన్‌పై 10 ప్రత్యేక పుస్తకాలు, 13 ప్రాంతీయ భాషలలో రూపొందించబడ్డాయన్నారు. అంతరిక్ష సంబంధిత కార్యకలాపాలపై అవగాహన పొందిన తర్వాత అన్ని పాఠశాలలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు, చంద్రయాన్ నమూనా తయారీ, మరియు పెయింటింగ్ పోటీలు నిర్వహించాలన్నారు. చంద్రయాన్ విజయం పై జాతీయ విద్యా పరిశోధనా సంస్థ రూపొందించిన వీడియోను జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా అన్ని పాఠశాలలలో ప్రదర్శించాలన్నారు. అంతరిక్ష పరిజ్ఞానం కలిగిన ప్రముఖ వ్యక్తులను ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల జీసీడీవో స్నేహలత ఏడీ శామ్యూల్ పాల్ జిల్లాసైన్స్ అధికారిణి రంగమ్మ పాల్గొన్నారు.

నెలాఖరులోగా పంట నమోదు చేయించుకోవాలి

విశాలాంధ్ర -కోడుమూరు: మండలంలోని రైతులందరూ ఈ నెలాఖరులోగా తమ పంట పొలాల్లో వేసిన పంటల వివరాలను రైతు సేవ కేంద్రాల్లో తప్పనిసరిగా పంట నమోదుచేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎన్.రవి ప్రకాష్ కోరారు. గురువారం ఆయన మండలంలోని వెంకటగిరి గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రవి ప్రకాష్ మాట్లాడుతూ మండలంలో 35,369 ఎకరాల సాధారణ విస్తీర్ణం ఉండగా, ఇప్పటివరకు 12,062 ఎకరాలలో పంట నమోదు చేశామన్నారు. ఇంకా 23,300 ఎకరాలలో పంట విస్తీర్ణంలోని పంటలు వివరాలను నమోదు చేయాల్సి ఉందన్నారు. మండలంలోని రైతులందరూ రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈనెల ఆఖరిలోగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. లేనియెడల రైతుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన ఇన్సూరెన్స్, మద్దతు ధర వంటి తదితర ప్రభుత్వ పథకాలు అందవని రైతులకు తెలిపారు. వ్యవసాయ సిబ్బంది కౌలుట్ల, రసూల్, వెంకటగిరి గ్రామ రైతులు పాల్గొన్నారు.

అందుబాటు ధరల్లో బిర్లా ఓపస్ పెయింట్ ధరలు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : బిర్లా ఓపస్ పెయింట్ ఇతర పోటీ దారుల కంటే తక్కువ ధరలకు అందు బాటులో ఉన్నాయని బిర్లా ఓపస్ పెయింట్ మార్కెటింగ్ రాష్ట్ర హెడ్ సుమన్ రెడ్డి తెలిపారు. గురువారం నంద్యాల చెక్ పోస్ట్ నందికొట్కూరు రోడ్డులో బిర్లా ఓపస్ పెయింట్ శ్రీ తిరుమల ఎంటర్ప్రైజెస్‌ను క్లాస్-1 కాంట్రాక్టర్ పల్లె ప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బిర్లా ఓపస్ పెయింట్ మార్కెటింగ్ రాష్ట్ర హెడ్ సుమన్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమలోనే కర్నూలులో బిర్లా ఓపస్ పెయింట్ తొలి షోరూంను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అత్యుత్తమ ఉత్పత్తి, నాణ్యతతో వినియోగదారులను ఆకర్శించడమేలక్ష్యమని తెలిపారు. ప్రతి 20 లీటర్ల పెయింట్ కొనుగోలుకు కంపెనీ 10శాతం ఆఫర్లు ప్రకటించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీలర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో మొక్కలు నాటండి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : పర్యావరణ పరిరక్షణకు అందరూ నడుం బిగించాలని, ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష పిలుపునిచ్చారు. గురువారం తల్లి పేరుతో మొక్కలి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తన తల్లి పేరుతో మామిడి మొక్కను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం "ఏక్ పేడ్ మా కే నామ్ అనే కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో ప్రారంభించి సెప్టెంబర్ 2024 నాటికి 80 కోట్ల మొక్కలను, మార్చి 2025 నాటికి 140 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్ణయించింద న్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఈ రోజు లక్ష మొక్కలను నాటుతున్నామని కలెక్టర్ తెలిపారు. అమ్మ, మొక్క భూమాత వంటి మూడింటి మధ్య సారూప్యత ఉంటుందని, అమ్మ కుటుంబమంతటినీ బాధ్యతగా సంరక్షిస్తే.. పర్యావరణంలోని జీవరాశులన్నింటి మనుగడకు మొక్కలు కీలకమని, పర్యావరణం అంతటినీ ఓపికతో భరించేది భూమాత అని కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛమైన గాలి కలుషితం కాకుండా స్వచ్ఛంగా ఉండాలంటే ఖచ్చితంగా అధికంగా మొక్కలు నాటి భావి తరాలకు ప్రాణ వాయువును అందించాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలోనూ, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణంలోనూ, వీలైన ప్రదేశాలలో ప్రతి ఒక్కరూ వారి తల్లుల పేరు మీద మొక్కలను నాటాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. మొక్కలు నాటిన అనంతరం సంబంధిత ఫోటోలు మేరీ లైఫ్ పోర్టల్ లో అప్లోడ్ చేసేందుకు కూడా అవకాశం ఉందని కలెక్టర్ అన్నారు. డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వయనాడ్ వరద బాధితులకు విరాళం అందజేత

విశాలాంధ్ర-పత్తికొండ: పత్తికొండలో విద్యార్థి ఉద్యమంలో పని చేసిన ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు రామ్మోహన్ రెడ్డి, రాంగోపాల్ రెడ్డి, శ్రీనివాసరెడ్డిలు కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులకు గురువారం స్థానిక చదువుల రామయ్య భవనంలో రూ.10 వేల విరాళాన్ని సీపీఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఏర్పడిన వరద బాధితులను మానవతా దృక్పథంతో ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు కారన్న, పెద్ద ఈరన్న, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు నెట్టికంటయ్య, ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు పెద్దయ్య పాల్గొన్నారు.

స్మశాన వాటిక స్థలాన్ని రక్షించాలి : టీడీపీ

విశాలాంధ్ర - కౌతాళంరూరల్ : మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న స్మశాన వాటిక స్థలాన్ని కబ్జాకు గురి కాకుండా రక్షించాలని టీడీపీ నాయకులు గొట్టయ్య, ముకన్నా, గిరి, కృష్ణ, వలిబాష, దేవేంద్ర రామచంద్రలు కోరారు. గురువారం ఉదయం వారు మాట్లాడుతూ గ్రామంలోని స్మశాన వాటిక 14 ఎకరాల 32 సెంట్లుగా రికార్డు ఉందన్నారు. అయితే ఆన్లైన్లో కేవలం 7 ఎకరాల 32 సెంట్లుగా చూపిస్తుందన్నారు. చుట్టుపక్కల ఉన్న రైతులు ఆక్రమణకు పాల్పడ్డారని దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారికి ఫిర్యాదు చేశారు. స్మశాన వాటికలో పెరిగిన ముళ్ళకంపలను ఉపాధి హామీ పథకం ద్వారా కంపచెట్లను తొలగించి మండల సర్వే ద్వారా కొలతలు చేయించి స్మశాన వాటిక హద్దులు ఏర్పాటు చేసి కబ్జాకు గురికాకుండా తగు చర్యలు చేపట్టాలని వారు కోరారు. లేనియెడల ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని వారు తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సీపీఐ

విశాలాంధ్ర-పత్తికొండ: భారీ వర్షాలకు పంట నష్ట పోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు పెద్ద ఈరన్న డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో అరకొర కురిసిన వర్షాలకు రైతులు వేరుశనగ, పత్తి, మిరప, టమోట, ఉల్లి, సజ్జ, జొన్న పంటలు సాగు చేశారన్నారు. పంట దిగుబడికి వేలాది రూపాయలు అప్పులు తీసుకువచ్చి పెట్టుబడులు పెట్టారని, గత మూడు రోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లి వరదలు రావడంతో పంటలు నీట మునిగి, కొట్టుకుపోయి రైతులు తీవ్రంగా నష్టపోవడం జరిగిందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట పెట్టుబడికి బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు మాఫీ చేయాలన్నారు. రబీ సీజన్ లో పంటలు సాగు చేసుకునేందుకు విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజ నేయులు, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు కారన్న, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు నెట్టికంటయ్య, నాయకులు మాదన్న, నరసింహులు, ఉరుకుందు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత అందరిది

విశాలాంధ్ర - సి.బెళగల్ : మొక్కలను నాటి, వాటి సంరక్షణ చూసుకొని పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని మండల అభివృద్ధి అధికారి ఏసీ రాముడు, ఎపిడి అల్లిపీరా అన్నారు. మండల పరిధిలోని బూరాన్‌దొడ్డి గ్రామంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అమ్మ కొరకు ఒక మొక్క అనే కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల యందు ఏపిఓ లక్ష్మన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఉపాధి హామీ ఏడిఏ అల్లిపీరా, మండల అభివృద్ధి అధికారి ఏసీ రాముడు తదితరులు కలిసి 4 వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా బూరాన్ దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కృష్ణ దొడ్డి గ్రామం దగ్గర ఉన్న కోన వెంకటేశ్వర స్వామి కొండ దగ్గర మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ చెట్లను నాటి వాటి సంరక్షణ చూసుకుని చెట్లను పెంచి కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎంపీడీవో, ఎపిడితో పాటు ఈఓఆర్ డి.సందీప్, ఏపీఓ లక్ష్మన్న, ఈసీ వృద్వి, బూరాన్ దొడ్డి సర్పంచ్ రామాంజ నేయులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వెంకటేష్, పాఠశాల సిబ్బంది, నాయకులు రామ్మోహన్ రెడ్డి తదితర అధికార సిబ్బంది పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శుక్రవారం 23, ఆగష్టు 2024

అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: కలకత్తాలో డాక్టర్‌పై అత్యాచారం చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, జుడా రిలే నిరహార దీక్షకు జన విజ్ఞాన వేదిక ఏపీ మహిళా సమాఖ్య మద్దతు కోల్‌కత్తా వైద్యురాలి సంఘటనలో బాధితురాలి కుటుంబానికి సత్వర న్యాయం అందించాలని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ వి.బ్రహ్మా రెడ్డి, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి.శ్రావణి అన్నారు. గురువారం ఆప్ జుడా ఆధ్వర్యంలో జీజీహెచ్‌లో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, జెవివి సభ్యులు ఆప్ జుడా పోరాటానికి మద్దతుగా నిరాహార దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త చట్టాలు అని కాలయాపన చేయరాదని ఉన్న చట్టాల్లో అత్యధిక శిక్ష ఏది ఉంటే దాన్ని వేయాలని, విచారణ పేరుతో సంవత్సరాల తరబడి కాలయాపన చేయకుండా నిర్ణీత కాలవ్యవిదిలో దోషులకు శిక్ష విధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమాజం పురుషాధిక్య సమాజం అని పురుషుల్లో స్త్రీల పట్ల వారి దృక్పథంలో మార్పు రావాలని, అప్పుడే ఈ అత్యాచారాలకు అడ్డుకట్టపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు సురేష్ కుమార్,జాతీయ నాయకులు మొహమ్మద్ మియ్యా, శేషాద్రి రెడ్డి, రామలక్షన్, శంకర్ రావ్, అడ్వకేట్ శంకర్ రావు, సుజాత,వీరేష్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏపీ మహిళా సమాఖ్య నాయకులు సులోచన, వెంకటేశ్వరమ్మ, మునెమ్మ, నాగేంద్రమ్మ, ఆశాబేగం, అంజలి, శైలజా, ఆదిలక్ష్మీ, ప్రజానాట్యమండలి నాయకులు శ్రీను, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

అధిక వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో -కర్నూలు : ట్రాక్టర్, లారీ యజమానులు ప్రభుత్వం నిర్దేశించిన ధరకు మాత్రమే ఇసుక రవాణా చేయాలని, అంతకుమించిన ధరను వసూలు చేస్తే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధికారులతో బోట్ మెన్ సొసైటీలు, ట్రాక్టర్, లారీ యాజమాన్యాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సి.బెళగల్ మండలంలోని కొత్తకోట, కె.సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాలలోని ఐదు డిసిల్టేషన్ పాయింట్లలో ప్రజలకు ఇసుక అందు బాటులోకి రానుందన్నారు. ఇసుక ధర తవ్వకంతో పాటు జీఎస్టీ, లోడింగ్, సీనరేజ్ తదితర చార్జీలు కలిపి ఒక టన్ ధరకు వినియోగదారుడు మొత్తం రూ.326 చెల్లించేలా కమిటీ నిర్ణయించిందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఇసుకను రవాణా చేసే ట్రాక్టర్, లారీ యజమానుల వివరాలన్నింటిని ప్రదర్శించడం జరుగు తుందని, ఆ వాహనాలను మాత్రమే అక్కడికి అనుమతించడం జరుగుతుందన్నారు. రోజుకు సుమారుగా 250 మంది వినియోగదారులకు ఇసుక సరఫరా చేసే దిశగా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వాహనాల ధర పట్టికను కూడా ప్రతి స్టాక్, బుకింగ్ పాయింట్ వద్ద ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్‌ఓ చిరంజీవి, కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి, ఆదోని ఇంఛార్జి సబ్ కలెక్టర్ విశ్వనాథ్, గనుల శాఖ డిడి రాజశేఖర్, డిటిసి శ్రీధర్, సెబ్, పర్యావరణ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సీబీఎన్ ఆర్మీలకు అండగా ఉంటాం

విశాలాంధ్ర - హొళగుంద : టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, గత ప్రభుత్వం ఎన్ని విధాలుగా కట్టడి చేయాలని చూసినా నిజాన్ని నిర్భయంగా మన టిడిపి యాప్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి నందుకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆలూరు నియోజక వర్గం టీడీపీ ఇన్చార్జ్ వీరభద్ర గౌడ అన్నారు. గురువారం సీబీఎన్ ఆర్మీ యాప్ సైనికుడు ముల్లా మోయిన్‌కు శాలువా కప్పి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జ్ వీరభద్ర గూడా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు నడుచుకుంటామని టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు, సీబీఎన్ ఆర్మీ, ఎన్‌బికె, ఎన్టీఆర్ అభిమానులకు ఏమి కష్టం వచ్చినా పరిష్కరించడానికి కృషి చేస్తానని నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. సివిఆర్ ఆర్మీ సైనికుడు సదాశివ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఇంటి దగ్గర మొక్కలు నాటాలి

విశాలాంధ్ర - గోనెగండ్ల: ప్రతి ఒక్కరు ఇంటి దగ్గర మొక్కను పెంచాలని సర్పంచ్ పూజారి హైమవతి, భర్త అడ్వకేట్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్‌లు ఎస్.రహుమ్ తుల్లా, పి.రంగమునిలు అన్నారు. గురువారం మండల కేంద్రంలో దంపుయార్డ్, లక్ష్మి పేట స్కూల్ నందు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో అమ్మకు మొక్క కార్యక్రమం ద్వారా సర్పంచ్ పూజారి హైమవతి, గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మొక్కలు నాటి న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు పెంచటం వల్ల, మనుషులకు ఆక్సిజన్, వర్షాలు బాగా కురుస్తాయి అని అన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరు ఇంటి దగ్గర మొక్కలు నాటాలని, ఇది మనందరి బాధ్యత పిలుపునిచ్చారు. అడ్వకేట్ వెంకటేష్, ఎన్‌వీ బాబు నాయుడు, వార్డు సభ్యులు అక్బర్, సుభాన్, టౌన్ ప్రెసిడెంట్ రమేష్ నాయుడు, మిన్నల్లా, డీలర్ పక్కర్ ద్దీన్, విద్యా కమిటీ చైర్మన్ రాముపురం రంజాన్, ఎస్ఎన్ మాబువలి, పంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ సలాం, టిడిపి, జనసేనా, బిజేపీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సైని సన్మానించిన సర్పంచ్ చంద్రమోహన్

విశాలాంధ్ర - రుద్రవరం : మండల ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై వరప్రసాద్‌ను ఎల్లవత్తుల గ్రామ సర్పంచ్ చంద్రమోహన్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం టిడిపి నాయకులు బొకేలను ఇచ్చి పూల మాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ప్రజలు సుఖశాంతులతో జీవించేందుకుగాను, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా తమరు తీసుకోబోయే చర్యలకు తమ వంతుగా తమరికి సహాయ సహకారాలను అందివ్వడం జరుగుతుందని వారు తెలిపారు. టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, కిట్టు, ఈశ్వరయ్య, జయసింహుడు, మహేష్ తదితరులు ఉన్నారు.

మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : జనసేన ఉమ్మడి జిల్లా ప్రచార కార్యకర్త శ్రీరాములు ఆధ్వర్యంలో పద్మ విభూషన్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా మండలంలో ఎస్సార్‌బీసీ కాలనీలో వున్న వృద్ధ ఆశ్రమంలో వృద్ధులకు బ్రెడ్, పాలు, అరటి, ఆపిల్ పండ్లు ఇవ్వడం జరిగింది. అభిమానులు అందరు కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అరుణ్, సుధాకర్, శ్యామ్, హ్యాబిబుల్, హుస్సేన్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

వంద మద్యం సీసాలు స్వాధీనం

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని మల్లెవేముల బస్టాండు సమీపంలో వంద మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్ రెడ్డి గురువారం తెలిపారు. పట్టణానికి చెందిన నూరుల్లా దగ్గర వంద మద్యం సీసాలు కొనుగోలు చేసి అక్రమంగా విక్రయించేందుకు తరలిస్తుండగా మల్లెవేముల బస్టాండులో పట్టుకొని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలి

విశాలాంధ్ర -పత్తికొండ: మొక్కలు నాటడం సమాజంలో ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సూచించారు. గురువారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద దేశ వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఏపీ డి.పక్కీరప్ప, ఏపీఓ వెంకటేశ్వర్లు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వీరేశప్ప, టీడీపీ నాయకులు బత్తిన లోకనాథ్, ఉపాధి హామీ సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మా పరిశ్రమ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి

విశాలాంధ్ర - వెలుగోడు: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా పరిశ్రమలో రియాక్టర్ పేలి కార్మికుల మరణానికి కారణమైన యాజమాన్యాన్ని తక్షణమే అరెస్టు చేయాలని సీపీఐ (ఎమ్మెల్) న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక వెలుగోడులో గురువారం పార్టీ ప్రజాసంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో అయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియ ఫార్మా పరిశ్రమలో రియాక్టర్ పేలి 50 మందికి పైగా తీవ్ర గాయాలయ్యారని, 18 మందికిపైగా కార్మికులు మరణించి, అనేకమంది కార్మికుల శవాలు శిథిలాల క్రింద ఉన్నట్లు తెలుస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని, ఒక్కో కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.గోపాల్, అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్ల నాయుడు, లాలూ నాయక్, సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీలు సీజ్

విశాలాంధ్ర - జిల్లా పరిషత్: కంకర గ్రావెల్, ఎండోమెంట్ పౌడర్‌ను తరలిస్తున్న లారీలను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఒకటి, తాలూకా పోలీస్టేషన్‌లో ఒకటి, ఓర్వకల్లు పోలీస్ స్టేషన్లో ఒకటి ఉంచడం జరిగిందని, వీటికి అపరాధ రుసుము వసూలు చేసి, విడిపించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయల్టీ ఇన్స్పెక్టర్ మురహరి, విజిలెన్స్ రాయల్టీ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-పత్తికొండ: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీలు, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలతో పట్టణ పురవీధుల గుండా ర్యాలీ చేపట్టి నాలుగు స్తంభాల దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునే విధంగా జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి అతి కిరాతకంగా హత్య చేసిన నరరూప రాక్షసులను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వివేక్, రంజిత్, విద్యార్థినీలు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను చెల్లించాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చెల్లించవలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిటిఎఫ్ డిమాండ్ చేస్తున్నది. గురువారం డిటిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు లక్ష్మారెడ్డి ప్రథమ వర్ధంతిని జిల్లా కార్యాలయంలో పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, పత్రిక ప్రధాన సంపాదకులు రత్నం ఏసే పు, సుబ్బ రాయుడు, హుస్సేన్, శివ నాగరాజు ,రాఘ వేంద్ర పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ 11వ పి ఆర్ సి బకాయిలను చెల్లించాలని కోరారు. సిబిఎస్‌సి పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు ప్రశ్నాపత్రాలు ద్వారా పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న డిఏ బకాయిలను చెల్లించాలని కోరారు. సిపిఎస్ ,జిపిఎస్ రద్దుచేసి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఓపిఎస్ అమలు చేయాలని కోరారు. ప్రతినెల ఒకటో తేదీన ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వాలి. దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సంపాదిత సెలవు నగదు చెల్లింపు, పిఎఫ్, ఎపిజిఎల్ఐ లోన్లు క్లెయిమ్స్ సకాలంలో చెల్లించుటకు చర్యలు తీసుకోవాలి. ఉమ్మడి సీనియర్ ఆధారంగా హెచ్‌ఎం, జేఎల్, డిఐఈటి, ఐఏఎస్‌సి, డియిఓఇ తర క్యాడర్లకు పదోన్నతులు కల్పించాలి. పిఆర్‌సి కమిషన్ నియామకం, నివేదిక ఆలస్యమైనందున వెంటనే 25శాతం మధ్యంతర భృతి చెల్లించాలన్నారు. విద్యా రంగంలో ఉపాధ్యాయ నియమకాల్లో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానము రద్దు చేయాలి. కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించిన 98, 2008 డిఎస్‌సి వారిని రెగ్యులర్ చేయాలని, ఉద్యమాల సందర్భంగా ఉపాధ్యాయుల మీద నమోదు చేసిన పోలీసుల కేసులు ఎత్తివేయాలన్నారు.

ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాలలో సీనియర్ మెగా అభిమాని లక్ష్మీకాంత్, టిడిపి, జనసేన సమన్వయకర్త పిడతల సుధాకర్, రామ్ చరణ్ యువశక్తి జిల్లా అధ్యక్షులు పబ్బతి రవి ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామ థియేటర్ కాంప్లెక్స్‌లో ఉదయం ఇంద్ర ఫ్యాన్స్ షో వేయించామని, వెండితెర ఇలవేల్పు మెగాస్టార్ కొణిదెల సింహం చిరంజీవేనన్నారు. థియేటర్ ప్రాంగణంలో బాణసంచా పేల్చి కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నామన్నారు. ఎంతో మంది ప్రజల హృదయాల్లో ఖైదీగా, ప్రజలకు అనేక రకాలుగా సేవలు చేసి ఆపదలో ఆదుకునే ఆపద్బాంధవుడిగా మెగాస్టార్ ఎల్లప్పుడూ ఉంటారని కొనియాడారు. నంద్యాల సర్వజన ఆస్పత్రిలో దాదాపు 50 మంది మెగా అభిమానులు రక్తదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీర మహిళలు సంగా జయంతి, లక్ష్మీ, జన సైనికులు సందీప్, సురేష్, శ్రావణ్, షాషావలి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షిద్దాం

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని టిడిపి నియోజకవర్గ మాజీ ఇంచార్జ్,టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మండలంలోని మండగిరి గ్రామ పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ సుదీర్ఘ 450 ఏళ్ల నుంచి పర్యావరణంలో విపరీతమైన మార్పులు జరుగుతున్నాయని, వీటి వలన సకాలంలో వర్షాలు పడక రైతులు ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తెలియజేశారు. చెట్లను నరికి వేయడంతో పర్యావరణానికి పెనుముప్పుగా మారుతుందన్నారు. చెట్లను నరకడంతోనే వాతావరనానికి హాని జరిగే వర్షం కురవకపోవడం జరుగుతుందన్నారు. ప్రతి మనిషి మొక్కలు నాటక పోతే భవిష్యత్తులో ఆక్సిజన్ ను అధిక డబ్బులు వెచ్చించి పరిస్థితులు పొంచి ఉన్నాయన్నారు. జన్మదిన, పెళ్లి రోజు ప్రతి అకేషన్‌కు మొక్కలు నాటి సంరక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో ఎపిడి లోకేష్,ఏపీవో కలిక్, టెక్నికల్ అసిస్టెంట్ ఆనంద్, మారుతి, వీరేష్ తదితరులు ఉన్నారు.

సీఐకి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - కోడుమూరు: కోడుమూరు సర్కిల్ పోలీస్ స్టేషన్లో నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన తబ్రేజ్‌కు మండల టిడిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఉదయం పట్టణంలోని స్థానిక సర్కిల్ కార్యాలయంలో కోడుమూరు గ్రామ సర్పంచ్ బి.భాగ్యరత్న, టిడిపి నాయకులు కె.హేమాద్రిరెడ్డి, మాజీ సర్పంచ్ కేఈ రాంబాబు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కె.మధుసూదనరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంధ్రయ్యలు సీఐ తబ్రేజ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ పూల బొకే అందించి,శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడుమూరు నూతన సిఐగా తబ్రేజ్ పదవి బాధ్యతలు చేపట్టడం సంతోషకరమన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపి, శాంతిభద్రతలకు విఘాతం కల్గకుండా మండలంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలన్నారు. ప్రధానంగా పట్టణంలోని కర్నూలు- బళ్లారి రహదారిలో ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని సర్పంచ్ దంపతులు భాగ్యరత్న, ఆంధ్రయ్యలు సీఐ తబ్రేజ్‌కు తెలిపారు.

మొక్కలు నాటుదాం.. ప్రకృతిని పెంచుదాం

విశాలాంధ్ర-చిప్పగిరి: సమాజంలో మొక్కలు నాటుదాం ప్రకృతిని పెంచుదాం అనే నినాదంతో ప్రతి ఒక్కరు ఒక్కొక్క మొక్కచొప్పున నాటి దాన్ని పెంచే బాధ్యత తీసుకోవాలని ఇన్చార్జి ఈఓఆర్‌డి బాలన్న, జాతీయ ఉపాధి హామీ ఎపిఓ మాధవ శంకర్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలిని పీల్చాలంటే మన చుట్టూ ప్రకృతిని విస్తరించుకోవాలని అప్పుడే మన ఆరోగ్యాలను కాపాడుకున్న వారమవుతామన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నేమకల్లు, నగర డోణ గ్రామాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. అనంతరం మొక్కలు నాటి వాటిని పెద్దగా చేసుకున్నట్లయితే కలిగే లాభాలను గ్రామాల ప్రజలకు, ఉపాధి హామీ కూలీలకు వివరించారు. కార్యక్రమంలోఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు మారుతి ప్రసాద్, లక్ష్మన్న ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల్లో మినిస్టీరియల్ ఉద్యోగులకు బదిలీలు చేపట్టాలి

విశాలాంధ్ర - నంద్యాల : ప్రభుత్వ శాఖల్లో మినిస్టీరియల్ ఉద్యోగులకు బదిలీలు చేపట్టాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానించింది. విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్. సూర్య నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్న సమావేశంలో అన్నీ శాఖల్లోని మినిస్టీరియల్ ఉద్యోగులకు రిక్వెస్ట్ బదిలీలు చేయాలని, సంవత్సరం లోపు పదవీ విరమణ చేయుచున్న వారికి ఈ బదిలీల్లో మినహాయింపు ఇవ్వాలని, అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ పై బదిలీలు సరియైన కారణాలతోనే చేయాలని, పాత బకాయిలు చెల్లించాలని, జీపిఎఫ్, ఎపిజిఎల్ఐ లోన్స్ వెంటనే మంజూరు చేయాలని, 12వ వేతన సవరణ అమలుకు ఇంకా సమయం పడుతున్న కారణంగా విజయదశమి కానుకగా ఇంటీరియం రిలీఫ్ మంజూరు చేయాలని, వైద్య, ఆరోగ్య శాఖలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, 143 ఉత్తర్వులను పునః సమీక్షించాలని సమా వేశంలో తీర్మానం చేసినట్లు నంద్యాల జిల్లా అధ్యక్షులు కె.నాగేంద్రప్ప, కార్యదర్శి తిరుపాలయ్య, సహా అధ్యక్షులు శ్రీహరి, కోశాధికారి బి.శ్రీనివాసులు తెలిపారు.

మొక్కలను సంరక్షించడం అందరి బాధ్యత

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మొక్కలను నాటి, వాటిని సంరక్షించడం అందరి సామాజిక బాధ్యతగా గుర్తించాలని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అమ్మ కొరకు ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని దొడ్డిమేకల, గంగులపాడు, హెచ్ మురవణి, జాలవాడి, కంబలదిన్నె, కల్లుకుంట, మేకడోన, పెద్దకడబూరు తదితర గ్రామాలలో నిర్వహించారు. మండల కేంద్రమైన పెద్దకడబూరులోని స్థానిక ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం మొక్కలను రక్షిస్తే, మొక్కలు మనలను రక్షిస్తాయన్నారు. మొక్కలు వలన మానవాళికి జీవనాధారమని గుర్తు చేశారు. వాటి వలన సకాలంలో వర్షాలు కురవడమే కాక గాలి కాలుష్యాన్ని నివారించడంతో ఉపయోగపడుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రంగన్న, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ స్వామిరాజు, టిడిపి నాయకులు మల్లికార్జున, మీసేవ ఆంజనేయ, తలారి అంజి, బొగ్గుల నరసన్న, బాబురావు, హనుమేష్, సోమన్న, సత్యన్న గౌడ్, రామలింగ, జనార్ధన్, నర్సయ్య, హాజర్ వలి, ఈసి ఖాదర్ భాష, టెక్నికల్ అసిస్టెంట్లు రామ్మోహన్ రెడ్డి, డీలర్లు ఆదాము, ఇమ్మానియేలు, మల్లి, ఫీల్డ్ అసిస్టెంట్ మేకల రాజు, పురుషోత్తం, సుధాకర్, సందీప్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవిని ఆదర్శంగా తీసుకుందాం

విశాలాంధ్ర - కౌతాళం రూరల్ : తమ అభిమాన నటుడు పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ మెగాస్టార్ చిరంజీవిని ఆదర్శంగా తీసుకుని సమాజ సేవకు అలవర్చుకోవాలని జనసేన పార్టీ మండల అధ్యక్షులు రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఉదయం చిరంజీవి 69వ జన్మదిన సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలింతలకు రోగు లకు పాలు, పండ్లు, బిస్కెట్లు అందజేసి తమ అభిమాన నటుడు జన్మ దినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆరోగ్య కేంద్రంలో వైద్యా ధికారి కిరణ్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ సినీ పరిశ్రమ ద్వారా అలాగే సమాజ సేవ ద్వారా ఎంతో పేరు గడిచారన్నారు. బ్లడ్ బ్యాంకు ను ఏర్పాటు చేసి ఎంతోమంది జీవితాలను కాపాడి కొత్త జీవితాన్ని అందించిన ఘనత మెగాస్టార్ చిరంజీవికి దక్కుతుందన్నారు. నేటి యువత చిరంజీవిని ఆదర్శంగా తీసుకుని సమాజసేవలో ముందుండాలని సూచించారు. నాయకులు మహమ్మద్, జట్టప్ప, రమేష్, నాగరాజు పాల్గొన్నారు

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంపీపీ

విశాలాంధ్ర - పెద్ద కడబూరు: స్థానిక ప్రాథమిక పాఠశాల (మెయిన్)ను గురువారం ఎంపీపీ శ్రీవిద్య, మండల విద్యాధికారిణి సువర్ణల సునియం, ఎంపీడీఓ జనార్దన్, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డిలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విధ్యార్థుల సంఖ్య, ఎంత మంది హాజరు అవుతారని ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని ఆదేశించారు. అనంతరం అమ్మకు ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెట్లను సంరక్షించే బాధ్యత అందరిది

విశాలాంధ్ర - హొళగుంద : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలోసర్పంచ్ చలువాది రంగమ్మ గురువారం మొక్కలను నాటారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కేజీబీవీ పాఠశాల ఆవరణంలోనూ మొక్కలను సర్పంచ్ రంగమ్మ నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ మాట్లాడుతూ చెట్లు తల్లి లాంటివని వాటిని సంరక్షించే బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజలకు చెట్లు వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు .గ్రామంలో వివిధ రకాల 200 మొక్కలను నాటామని మొక్కలు పెంచే బాధ్యత సిబ్బంది చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చెట్లు ప్రగతికి మెట్లని చెట్లను ఎవరు నరకకుండా చూడాలని అన్నారు. మండలంలో దాదాపు నాలుగువేల మొక్కలను నాటే కార్యక్రమం జరిగిందని కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ న్యూటన్, బిందు మాధవి, సిహెచ్ఓ, బిజెపి, జనసేన మండల కన్వీనర్లు ప్రసాద్, అశోక్, బిజెపి సీనియర్ నాయకుడు చిదానంద, జనసేన నాయకుడు వీరేష్, వైకాపా నాయకుడు పంపా, పిఏఏలు సుంకమ్మ, మణిశ్రీ, ఫీల్డ్ అసిస్టెంట్ మంజునాథ్, ఆశా వర్కర్లు, మేటీలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించుకుందాం

విశాలాంధ్ర - కౌతాలం రూరల్ : మన పరిసర ప్రాంతాలు, పొలాల్లో మొక్కలను సంరక్షించుకొని భావితరాలకు స్వచ్ఛమైన గాలి నీరు అందే విధంగా కృషి చేద్దామని తెలుగు యువత నాయకులు సతీష్ నాయుడు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ప్లాంట్స్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. మొక్కల ద్వారా ఆ ప్రాంతాలలో అధిక శాతం వర్షపాతం నమోదు అవుతుందన్నారు. వర్షాల వలన మంచి పంటలు పండుతాయని, వంట చెరుకుల ఉపయోగపడుతుందని మొక్కల వలన ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. అందుకోసం ప్రతి వ్యక్తి ఒక్కో మొక్కను నాటి సంరక్షించుకొని ఒక పెద్ద వృక్షాన్ని తయారు చెయ్యడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీ రాములు స్థానిక నాయకులు రామలింగ, నగేష్, రమేష్, మాల రామా నుజులు, దేవిడ్,ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : నేడు అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సయ్యదున్నిసా తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కోయిలకుంట్ల మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఉదయం పది గంటలకు గ్రామసభలు గ్రామ ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. గ్రామసభలో అధికారులు ప్రజలు పాల్గొని విజయవంతం చేయడం కోరారు.